RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 253 | ఆదివారం, ఫిబ్రవరి 22 2026 | ఎడిటర్ : బట్టు లక్ష్మీనారాయణ, | పేజీలు : 6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram,Guntur,Nellor,Ongole,kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,




- కారిడార్‌ను జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ

## అందుబాటులోకి ఢిల్లీ-మీరట్
# నమో భారత్ కారిడార్

## కాంగ్రెస్‌లో కష్టపడితేనే
# పదవులు వరిస్తాయి

● అవకాశాలను అందిపుచ్చుకుని సాగాలి ● డిసిసి అధ్యక్ష పదవి ఎదిగేందుకు తొలిమెట్టు ● ఎవ్వరికైనా మెరిట్ లిస్ట్ ప్రకారమే అవకాశం
● భిన్నాభిప్రాయాలు పార్టీ కార్యకర్తల స్థయిర్యాన్ని దెబ్బతీస్తాయి
● డిసిసి అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి




**వికారాబాద్,ఫిబ్రవరి 21 :** భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గాంధీ సిద్దాంతాలను విశ్వసించే పార్టీ కాంగ్రెస్ అని ఆయన గుర్తుచేశారు. రిజర్వేషన్లను రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందని విమర్శించారు.రెండు తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం




వికారాబాద్ జిల్లా అనంతగిరిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఈ శిక్షణ డీసీసీ అధ్యక్షులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వారి అవకాశాలను మెరుగు పరుచుకునేందుకు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీ విధానాలు, ప్రజల సమస్యలపై మిగతా2లో...

ఆలయాలే లక్ష్యంగా దాడికి స్కెచ్
నిఘా వర్గాల హెచ్చరికలు జారీ
ఇతర నగరాల్లోనూ పేలుళ్లకు కుట్ర



# ఢిల్లీ ఉగ్రకుట్రకు లష్కరే ప్లాన్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21 :** దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ లష్కరే తయిబా(రామ) కుట్ర పన్నింది. ఈ మేరకు నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో ఢిల్లీ పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. ఢిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్ ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలే లక్ష్యంగా ఎల్ఈటీ దాడులకు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. చాందినీ మిగతా2లో...

## దేశం నుంచి చొరబాటుదార్లను
# తరిమేస్తాం

ఓటరు జాబితాతో పాటు, దేశంలోనూ స్థానం లేకుండా చేస్తాం
కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా హెచ్చరిక



**గౌహతి,21 :** నక్సలిజం నుంచి దేశం విముక్తి పొందుతున్నట్లే.. చొరబాటుదారులను ఏరివేయడం కూడా సాధ్యమేనని కేంద్ర మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. అక్రమ వలసదా రులను కేవలం ఓటర్ల జాబితా నుంచే కాకుండా.. దేశం నుంచే తొలగిస్తా మన్నారు. రాబోయే ఐదేళ్లలో ఈ పనిని పూర్తి చేస్తామని మిగతా2లో...

## రాష్ట్రప్రభుత్వ విన్నపాన్ని
# మన్నించిన సిసిఐ

● కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిలు వెంటనే స్పందించారు ● పత్తి కొనుగోళ్లు ఈ నెలాఖరు వరకు కొనసాగుతాయి ● పత్తి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి ● వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావువెల్లడి

**హైదరాబాద్,ఫిబ్రవరి 21 :**రాష్ట్రంలో ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగనున్న పత్తి కొనుగోళ్లు కొనసాగుతా యని, ఈ అవకాశాన్ని పత్తిరైతులు వినియోగించుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. తమ అభ్యర్థన మేరకు పత్తి కొనుగోళ్లను ఫిబ్రవరి నెలాఖరు వరకు సీసీఐ పొడిగించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల గడువును పొడిగించాలని ఇప్పటికే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లను కోరినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. పొడిగించిన గడువును మిగతా2లో...



## మహిళల ఆర్థిక సాధికారతే
# తెలంగాణ ప్రగతి

- జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సులో మంత్రి సీతక్క



**హైదరాబాద్,ఫిబ్రవరి 21 :** మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క అన్నారు. వారిని ఆర్థికంగా స్థితిమంతులుగా చేయడానికి ఇందిరా మహిళా శక్తి పథకాన్ని విజయ వంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సులో మహిళా సాధికారతలో తెలంగాణ సాధించిన ఆర్థిక ప్రగతిని ఆవిష్కరించారు. 46.68 లక్షల మంది మహిళలు 4.37 లక్షల స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదుగుతున్నారని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. గడిచిన రెండేండ్లలో మహిళా సంఘాలకు రూ.35.435 కోట్ల బ్యాంకింగ్ రుణాల మంజూరు మిగతా2లో...

## అన్ని దేశాలపై 10 శాతం
# సుంకాలు

- సుంకాలు వెంటనే అమల్లోకి..
- సుప్రీం తీర్పు తర్వాత ట్రంప్ ప్రకటన
- సుప్రీం తీర్పుపై ట్రంప్ తీవ్ర నిరాశ
- వాణిజ్య దిగ్బంధం విధిస్తానని హెచ్చరిక



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21 :** ప్రపంచ దేశాలపై అమెరికా విధించిన సుంకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సుంకాలు వెంటనే అమల్లోకి వస్తాయని ప్రకటించారు. ఈ సుంకాలు వెంటనే అమల్లోకి వచ్చేలా ఒక ఉత్తర్వుపై సంతకం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అయితే ఈ సుంకాలు ఫిబ్రవరి 24 నుంచి అమల్లోకి వస్తాయని వైట్‌హౌస్ వెల్లడించింది. ఇవి 150 రోజుల పాటు అమల్లో ఉంటాయని తెలిపింది.అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు విధించేందుకు ఓవల్ ఆఫీస్ నుంచి సంతకం చేయడం మిగతా2లో...

## ఆరు రాష్ట్రాల్లో పూర్తయిన
# సర్ ప్రక్రియ

గుజరాత్‌లో 68 లక్షల 12 వేల 711 ఓట్ల తొలగింపు
వవరాలు వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం




## అమెరికాతో ఒప్పందం
# రైతాంగానికి నష్టం

● దేశ రైతులతో పాటు తెలంగాణకూ ముప్పే ● మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్,ఫిబ్రవరి 21 :** కేంద్ర ప్రభుత్వం అమెరికాతో ఇటీవల చేసుకున్న ఒప్పందాల వల్ల తెలంగాణ రైతులతో పాటూ దేశంలోని రైతులు తీవ్ర నష్టానికి గురయ్యే ప్రమాదం ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అమెరికాలో సాగవుతున్న జొన్న, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి వంటి పంటలను భారతదేశంలోకి ఎలాంటి టాక్స్ లేకుండా అనుమతించడం వల్ల మన దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న రైతులతో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రైతులు ప్రమాదంలో పడతారని తెలిపారు. మన దేశంలో కూడా అన్నదాతలు మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, పత్తి పంటలని ఎక్కువగా పండిస్తూ జీవనం సాగిస్తున్నారని వివరించారు. అమెరికా దేశం నుంచి ఈ పంటలను దిగుమతి మిగతా2లో...

## గ్రామీణ ప్రాంతాల్లో గడచిన 12 ఏండ్లల్లో
# ఒక్క ఇల్లు కూడా లేదు

కనీసం ఈ ఏడాదిలోనైనా 3 లక్షల ఇండ్లు మంజూరు చేయండి
పేదల సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పం
కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి పొంగులేటి విజ్ఞప్తి



**హైదరాబాద్,ఫిబ్రవరి 21 :** తెలంగాణ ప్రాంత ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా 2014-23 వరకు దాదాపు పది సంవత్స రాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పేదల ఇండ్ల నిర్మాణం జరగలేదు. దీంతో ఇండ్ల నిర్మాణానికి ప్రజల నుంచి భారీ ఎత్తున డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన ఇండ్లను మంజూరు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పేదల సంక్షేమాన్ని మిగతా2లో...

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

# కాంగ్రెస్‌లో కష్టపడితేనే పదవులు వరిస్తాయి

(మొదటి పేజీ తరువాయి)

చర్చించేందుకు ఈ తరగతులు సహాయపడతాయని సీఎం అన్నారు. గాంధీజీపై లాఠీలు ఎత్తడానికి బ్రిటిషర్లు బయపడ్డారని, దేశభక్తులమని అనుకునే కొందరు తూటాలతో గాంధీని చంపారని విమర్శించారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉంటాయని, గాంధీ ఆలోచనలపై కూడా భిన్నాభిప్రాయాలు చెప్పినవారు ఉన్నారని తెలిపారు. 'భిన్నాభిప్రాయాలు చెప్పిన వారిని తరిమేస్తే మనకే నష్టం.. అందరూ కలిసి పనిచేస్తే అనుకున్నది సాధించవచ్చు' అని రేవంత్ అన్నారు. పార్టీలో ఏ లిస్టులకు చోటు లేదు.. కేవలం మెరిట్ లిస్టు ప్రకారమే అవకాశాలు వస్తాయి. డీసీసీ పదవి ఎంతో విలువైనది.. వచ్చిన అవకాశం దుర్వినియోగం చేసుకోవద్దు. డీసీసీ నుంచి పీసీసీ కావొచ్చు. ఎమ్మెల్యే కావొచ్చు.. ఎంపీ కావొచ్చు.. సీఎం కావొచ్చని రేవంత్ రెడ్డి అన్నారు.రెండున్నర శాతం ఓట్ల నుంచి 40 శాతం వరకు కాంగ్రెస్ పార్టీని తీసుకొచ్చామన్నారు. డిజిటల్ మెంబర్‌షిప్‌పై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్‌లో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసినవాళ్లమవుతామన్నారు. ఎన్నికలకు సమగ్ర సన్నద్ధత, ప్రజలతో అనుసంధానమే లక్ష్యంగా తెలంగాణ, ఏపీకి చెందిన డీసీసీ అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం రూ.వేల కోట్ల ఆస్తులను త్యాగం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో ఏళ్లు జైలులో ఉన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారు. పార్టీలో అందరి పనితీరు మీద నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. మెరిట్ ఉన్నవారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ బాధ్యతలు తీసుకున్న వారిని వెతికి మరీ పదవులు ఇచ్చామని సీఎం చెప్పుకొచ్చారు. నాయకుల ప్రతీ కదలికను గమనిస్తూనే ఉంటామని.. మెరిట్ కోటా తప్ప కాంగ్రెస్‌లో ఏ కోటా లేదని స్పష్టం చేశారు. మెరిట్ కోటాలో పాస్ అయితేనే పదవులు వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి చాలా విలువైనదని.. ఈ పదవిని దుర్వినియోగం చేస్తే దేవుడు కూడా కాపాడలేడన్నారు. 'డీసీసీ అధ్యక్ష పదవి మీ ఉన్నతికి తొలిమెట్టు' అని పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనాయకులను అవమానపరచాలని బీజేపీ కుట్ర చేస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీకి ఉండడానికి సొంత ఇల్లు కూడా లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలపై సీఎం రేవంత్ రెడ్డి పొగడ్తల వర్షం కురిపించారు. రాజకీయ వారసత్వం నుంచి షర్మిల వచ్చినా ఆమె అవకాశాలను తీసుకోలేదన్నారు. ముళ్లబాటలో కూడా ఏపీలో కాంగ్రెస్ కోసం షర్మిల కష్టపడుతున్నారని తెలిపారు. ప్రజల దగ్గరికి వెళ్ళి రాజకీయాల్లో రాణించాలని షర్మిల చేస్తున్న కృషిని ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. కాగా, డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరయ్యారు. అలాగే, రెండు రాష్ట్రాల నుంచి సుమారు 70 మంది డీసీసీ అధ్యక్షులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు

# రాష్ట్రప్రభుత్వ విన్నపాన్ని మన్నించిన సిసిఐ

(మొదటి పేజీ తరువాయి)

వినియోగించుకొని పత్తిని అమ్ముకోవాలని పత్తి రైతులను మంత్రి తుమ్మల కోరారు.రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు, రాష్ట్రంలోని పత్తి రైతులకు ఇబ్బంది కలగకుండా, ఫిబ్రవరి నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లను కొనసాగించాలని సీసీఐ అంగీకరించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. రైతుల ప్రయోజనాలను ప్రాధాన్యంగా తీసుకొని కొనుగోళ్ల గడువును పొడిగించాలని కేంద్ర ప్రభుత్వం మరియు సీసీఐ దృష్టికి తీసుకెళ్లగా, వారు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో పత్తి సాగు ఆలస్యంగా ప్రారంభమవడంతో దిగుబడులు కూడా ఆలస్యంగా మార్కెట్‌కు వస్తున్నాయి. ఈ వాస్తవ పరిస్థితిని కేంద్రానికి వివరిస్తూ కొనుగోళ్ల గడువును పొడిగించాలని మంత్రి గారు కోరారు. అలాగే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తో రాష్ట్ర పరిస్థితిని వివరించి, రైతులకు నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఈ సంవత్సరం 45.32 లక్షల ఎకరాలలో పత్తిని సాగు చేయగా, 28.29 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా వేయడం జరిగింది. ఇప్పటివరకు 8,80,053 మంది రైతుల నుంచి రూ.12,823 కోట్ల విలువైన 16.15 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. అదేవిధంగా ఇప్పటివరకు మార్కెట్ ద్వారా 2.24 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యత ప్రమాణాలు లేని పత్తిని కోనుగోలు చేయడం జరిగింది. అయినప్పటికీ రాష్ట్రంలో ఇంకా 9.99 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి రైతుల వద్ద ఉందని మార్కెటింగ్ అధికారులు అంచనా వేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం కొత్తగా తీసుకొచ్చిన కపాస్ కిసాన్ పై మొదట రైతులు మరియు జిన్నర్ల నుండి వ్యతిరేకత వచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తూ, రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం తీసుకోచ్చిన యాప్ కి రాష్ట్ర ప్రభుత్వం సపోర్టు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దీంతో ఈ యాప్ ద్వారా రైతులు క్యూలలో నిలబడే అవకాశం లేకుండా, సమయపాలన పాటిస్తూ, రైతులకు దగ్గరలోని పత్తి కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించుకునే అవకాశం కలగడంతో పాటు, పత్తి కొనుగోళ్లను రెగ్యులేట్ చేస్తూ, పారదర్శకంగా కొనుగోళ్లను చేపట్టే వెసులుబాటు కలిగిందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో రైతులకు సమయానికి ఎరువుల పంపిణీకి తమ సర్కారు మొబైల్ యూరియా బుకింగ్ యాప్ ని తీసుకొచ్చిందన్నారు. తద్వారా యూరియా బ్లాక్ మార్కెటింగ్ అరికట్టడంతో పాటు అధిక నిల్వలను నియంత్రిస్తూ పారదర్శక పంపిణీ వ్యవస్థ అమల్లోకి వచ్చిందన్నారు. పంట పూర్తిగా మార్కెట్‌కు రాకముందే సీసీఐ వారు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తారనే సమాచారంతో రైతుల్లో ఆందోళన నెలకొందని, నాణ్యమైన పత్తిని ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందనే భయం రైతుల్లో ఉన్న నేపథ్యంలో, మరో 30 రోజులు కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని మంత్రి తుమ్మల సీసీఐను ప్రత్యేకంగా కోరారు.

# అమెరికాతో ఒప్పందం రైతాంగానికి నష్టం

(మొదటి పేజీ తరువాయి)

చేసుకోవడం వల్ల తెలంగాణలో ఉన్న రైతులంతా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో రైతులకు సంబంధించిన ఓ కార్యక్రమానికి హరీశ్‌రావు ఇవాళ (శనివారం) హాజరయ్యారు. వివిధ స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయం చేస్తే మంచి లాభాలు పొందే అవకాశం ఉందని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న యాంత్రిక పరికరాలను ఉపయోగించుకోవాలని దిశానిర్దేశర చేశారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ సర్కార్ రైతు భరోసా రావడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు.

# మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి

(మొదటి పేజీ తరువాయి)

చేశామన్నారు.ఇందిరా మహిళా శక్తితో 2.05 లక్షల సూక్ష్మ వ్యాపారాలను మహిళా సంఘాలు స్థాపించాయని చెప్పారు. సమ్మక్క, సారలమ్మ జాతరలో ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళా సంఘాలకు రూ.3.5 కోట్లు లాభాలు వచ్చాయన్నారు. వారికి స్థిరమైన ఆదాయం కల్పించేందుకు ఆర్టీసీ అ÷-దదె బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ఎలాంట్లు మహిళా సంఘాలతో ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. జీడీపీలో మన దేశ మహిళల భాగస్వా మ్యం 18 శాతమే నమోదైందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది 40 శాతంగా ఉందన్నారు. మంత్రి సీతక్క ప్రసంగాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశంసించారు.

# అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు

(మొదటి పేజీ తరువాయి)

తనకు చాలా గౌరవంగా ఉందని ట్రూత్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇవి దాదాపు వెంటనే అమల్లోకి వస్తాయని తెలిపారు. ఈ విషయంపై అందిరికి ధన్యవాదాలు అని రాసుకొచ్చారు. చట్టపరమైన మరో అధికారాన్ని అమలు చేసే వరకు ఈ కొత్త సుంకం అమల్లో ఉంటుందని వైట్ హౌస్ అధికారి ఒకరు పేర్కొన్నారు. వాణిజ్య భాగస్వాములు అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలు ప్రకారం టారిఫ్‌లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. భారత్ 10 శాతం టారిఫ్ చెల్లించాలా అలాగే ఇది గతంలో ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకానమీక్ పవర్ యాక్ట్(ఐఈఈపీఏ) కింద విధించిన టారిఫ్‌లను భర్తీ చేస్తారా అని ప్రశ్నకు వైట్‌హౌస్ అధికారి ఈ మేరకు స్పందించారు. ఈ 10 శాతం గ్లోబల్ టారిఫ్ అనేది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేపట్టిన రక్షణాత్మక వాణిజ్య విధానంలో భాగమని పేర్కొన్నారు. చెల్లింపుల సమతుల్యత లోటును తగ్గించడం, అన్యాయ వాణిజ్య విధానాలను పరిష్కరించే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మరోవైపు రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్న చమురు కొనుగోళ్లను భారత్ తన అభ్యర్థన మేరకు గణనీయంగా తగ్గించిందని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. భారత్‌తో తనకు అద్భుతమైన సంబంధం ఉందని తెలిపారు. వైట్‌హౌస్‌లో అమెరికా సుప్రీంకోర్టు తను విధించిన టారిఫ్‌లను రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక భారత్‌తో ట్రేడ్ డీల్ కొనసాగుతుందని ట్రంప్ స్పష్టం చేశారు. పరస్పర టారిఫ్‌లను 18 శాతానికి తగ్గించిన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కొత్త చట్టపరమైన మార్గాల ద్వారా కొనసాగుతాయని సంకేతాలు ఇచ్చారు. ఇదిలా ఉండగా, సుంకాలతో భారత్- పాక్ యుద్ధాన్ని పరిష్కరించినట్లు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. 'నేను పరిష్కరించిన 8 యుద్ధాల్లో 5 యుద్ధాలను టారిఫ్‌ల ద్వారా ముగించాను. మీకు నచ్చినా, నచ్చకపోయినా నేను 8 యుద్ధాలను ముగించాను. అందులో భారత్-పాకిస్థాన్ వంటి అణు యుద్ధానికి దారితీసే పెద్ద వివాదాలు కూడా ఉన్నాయి. గురువారం జరిగిన పీస్ బోర్డ్ సమావేశంలో పాకిస్థాన్ ప్రధానమంత్రి మాట్లాడుతూ, అధ్యక్షుడు ట్రంప్ జోక్యం వల్ల 3.5 కోట్ల ప్రాణాలు కాపాడారని అన్నారు. వారు చాలా ప్రమాదకర చర్యలకు సిద్ధమవుతున్నారు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.భారత్-పాక్ ఘర్షణ సమయంలో 10 యుద్ధవిమానాలు కూల్చివేసినట్లు ట్రంప్ తెలిపారు. గురువారం 11 విమానాలు కూల్చివేశారని చెప్పిన ఆయన, ఇప్పుడు సంఖ్యను 10కి తగ్గించారు. ఆ యుద్ధం అణు యుద్ధానికి దారితీసేలా సాగుతోందని అన్నారు. దానిని టారిఫ్‌ల ద్వారానే ఆపినట్లు చెప్పారు. ఇరు దేశాలకు యుద్ధం చేయాలనుకుంటే చేయండని, కానీ అమెరికాతో వ్యాపారం చేయలేరు తేల్చి చెప్పాను. ప్రతి దేశంపై 200 శాతం టారిఫ్ విధిస్తాను హెచ్చరించాను. దీంతో ఇరుదేశాలు ఫోన్ చేసి విరమణ ఒప్పందానికి వచ్చినట్లు చెప్పారని ట్రంప్ పేర్కొన్నారు.మరోవైపు తన పన్నుల విధింపు అధికారాన్ని కట్టడి చేస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. శ్వేతసౌధంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన న్యాయవ్యవస్థపై ధ్వజమెత్తారు. ఈ తీర్పు దేశానికి తీరని అవమానమని, కొందరు న్యాయమూర్తులకు దేశం కోసం సరైన నిర్ణయం తీసుకునే ధైర్యం లేదని విమర్శించారు. అంతటితో ఆగకుండా, ఈ తీర్పు వెనుక 'విదేశీ ప్రయోజనాలు' ఉన్నాయని, న్యాయమూర్తులు బయటి వ్యక్తుల ప్రభావానికి లోనయ్యారని సంచలన ఆరోపణలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు తనను ఆపలేదని ట్రంప్ స్పష్టం చేశారు. పాత చట్టం కింద వేసిన పన్నులను కోర్టు కొట్టివేస్తే, తక్షణమే 'సెక్షన్ 122' కింద 10 శాతం గ్లోబల్ టారిఫ్ విధిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. "నేను ఎంత పన్ను వేయాలనుకుంటే అంత వేస్తాను.

పాత చట్టాల కంటే ఇప్పుడు మా దగ్గర ఉన్నవి చాలా శక్తిమంతమైనవి. అవసరమైతే ఏ దేశంపైనైనా వాణిజ్య దిగ్బంధం విధిస్తాను, ఇతర దేశాల వాణిజ్యాన్ని దెబ్బతీసే అధికారం నాకుంది" అంటూ ఆయన తన దూకుడును ప్రదర్శించారు. సుంకాల విధింపు వల్ల అమెరికాలో పరిశ్రమలు కళకళలాడుతున్నాయని ట్రంప్ చెప్పుకొచ్చారు. జార్జియాలోని ఒక స్టీల్ ప్లాంట్ యజమాని తనను కలిసి "సార్, మిమ్మల్ని ముద్దు పెట్టుకోవాలని ఉంది" అని అన్నారని ఆయన గుర్తు చేసుకున్నారు. విదేశీ వస్తువుల దిగుమతి ఆగిపోవడంతో అమెరికాలో నిరు ద్యోగం తగ్గిందని, స్టాక్ మార్కెట్ 50 వేల మార్కును దాటిందని ఆయన గర్వంగా ప్రకటించారు. సుప్రీం కోర్టు తీర్పుతో గతంలో వసూలు చేసిన సుమారు 175 బిలియన్ డాలర్ల పన్ను ఆదాయం ఇప్పుడు అనిశ్చితిలో పడింది. ఆ డబ్బును వెనక్కి ఇవ్వాల్సి ఉంటుందా అన్న ప్రశ్నకు.. "కోర్టు ఆ విషయం గురించి చర్చించలేదు, దీనిపై మరో ఐదేళ్ల పాటు కోర్టులో పోరాటం సాగుతుంది" అని ట్రంప్ దాటవేశారు.

# అందుబాటులోకి ఢిల్లీ-మీరట్ నమో భారత్ కారిడార్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21 :** ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం మీరట్‌లో పర్యటించి సుమారు రూ.12,930 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పర్యటనలో భాగంగా 82 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ 'నమో భారత్' రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్కారిడార్‌ను పూర్తిస్థాయిలో జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ 'మీరట్ మెట్రో' సేవలను కూడా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు మెట్రోలో ప్రయాణించారు. తాజా ప్రారంభోత్సవంతో ఢిల్లీలోని సారాయ్ కాలే ఖాన్ నుంచి మీరట్‌లోని మోదీపురం వరకు ప్రయాణ సమయం కేవలం 58 నిమిషాలకు తగ్గనుంది. ఇంతకుముందు ఈ ప్రయాణానికి దాదాపు మూడు గంటల సమయం పట్టేది. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే మీరట్ మెట్రో, దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలవనుంది. మరో విశేషమేమిటంటే, ఒకే రైల్వే ట్రాక్‌పై రీజనల్ రైలు (నమో భారత్), లోకల్ మెట్రో (మీరట్ మెట్రో) నడవడం దేశంలో ఇదే తొలిసారి. ఈ కొత్త విధానం పట్టణ రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రద్దీ తగ్గడంతో పాటు పర్యావరణ హితమైన రవాణాకు మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వం తెలిపింది.

# దిల్లీ ఉగ్రకుట్రకు లష్కరే ప్లాన్

(మొదటి పేజీ తరువాయి)

చౌక్ ప్రాంతంలోని ఒక దేవాలయంపై ఐఈడీతో దాడి చేసేందుకు ఉగ్రవాదులు వ్యూహం పన్నుతున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఫిబ్రవరి 6న పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారంగా, భారత్‌లోని ప్రముఖ ధార్మిక స్థలాలపై దాడులు చేయాలని లష్కరే ప్లాన్ చేస్తోందని నిఘా వర్గాలు చెబుతున్నాయి. కేవలం దిల్లీలోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలు కూడా ఉగ్రవాదుల హిట్ లిస్టులో ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది నవంబర్ 10న ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడులో 12 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఆ ఘటనపై దర్యాప్తు ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో మరోసారి ఎర్రకోట పరిసర ప్రాంతాలపై ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాల నుంచి హెచ్చరికలు రావడం దేశ రాజధానిలో కలకలం రేపుతోంది.

# దేశం నుంచి చొరబాటుదార్లను తరిమేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. అస్సాంలోని కామ్‌రూప్‌లో పోలీస్ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఓ సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. చొరబాటుదారుల ఆక్రమణల నుంచి విడిపించిన స్థలంలోనే ఈ కొత్త క్యాంపస్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు.చొరబాటుదారులను వారు ఆక్రమించిన స్థలాల నుంచి తరిమికొట్టినంత మాత్రాన సమస్య తీరిపోదు. వారు మరోచోట స్థిరపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారిని మొత్తంగా దేశం నుంచే బయటకు పంపించాలి. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. కానీ.. కాంగ్రెస్ ఆ పని చేయబోదు. ఎందుకంటే వారే ఆ పార్టీకి ఓటు బ్యాంకు' అని అమిత్ షా ఆరోపించారు. చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు.. అస్సాంకు ముప్పుగా మారాయని విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటే.. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని సవాల్ విసిరారు.రానున్న ఐదేళ్లలో ఈశాన్య భారతంలో అస్సాం పారిశ్రామిక కేంద్రంగా మారుతుందని అమిత్ షా చెప్పారు. అనంతరం గువాహటిలో నిర్వహించిన సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో పాల్గొన్నారు. శౌర్యపరాక్రమాలు, దేశభక్తిలో అందరికీ ఆదర్శంగా సీఆర్పీఎఫ్ నిలుస్తోందని పేర్కొన్నారు.

# ఆరు రాష్ట్రాల్లో పూర్తయిన సర్ ప్రక్రియ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21 :** ఆరు రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తయింది. ఆ వివరాలను ఎన్నికల కమిషన్ శనివారంనాడు విడుదల చేసింది. రివిజన్ పక్రియలో భాగంగా ఆయా రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో అనర్హత కలిగిన ఓటర్లను జాబితా నుంచి తొలగించింది. తాజాగా విడుదల చేసిన జాబితాలో అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల కంటే గుజరాత్‌లో అత్యధికంగా ఓటర్ల తొలగింపు చోటుచేసుకుంది. రికార్డు స్థాయిలో 68 లక్షల 12 వేల 711 మందిని జాబితా నుంచి తొలగించింది. ఎస్ఐఆర్ పక్రియకు ముందు 5,08,43,436 మంది ఓటర్లు ఉండగా అది ప్రస్తుతం 4,40,30,725కు తగ్గింది. మధ్యప్రదేశ్‌లో 34,25,078 మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించింది. దీంతో ఓటర్ల సంఖ్య 5,74,06,143 నుంచి 5,39,81,065కు తగ్గింది. తర రాష్ట్రాల్లోన్రూ గణనీయంగా ఓటర్ల జాబితాలో సవరణలు చేటుచేసుకున్నాయి. రాజస్థాన్‌లో ఓటర్ల సంఖ్య 5,46,56,215 నుంచి 5,15,19,929 మందికి తగ్గింది. ఛత్తీస్‌గఢ్‌లో 2,12,30,737 నుంచి 1,87,30,914కు, కేరళలో 2,78,50,855 నుంచి 2,69,53,644కు తగ్గింది. గోవాలో ఓటర్ల సంఖ్య 11,85,034 నుంచి 10,57,566కు తగ్గింది. కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ ఐలాండ్స్‌లో 52,364 మందిని జాబితా నుంచి తొలగించారు. దీంతో ఓటర్ల సంఖ్య 3,10,404 నుంచి 2,58,040కి తగ్గింది. పుదుచ్చేరిలో ఓటర్ల సంఖ్య 10,21,578 నుంచి 9,44,211 మందికి, లక్షద్వీప్‌లో 57,813 నుంచి 57,607కు తగ్గింది. ఓటర్ల మరణం, శాశ్వతంగా నివాసస్థలాల మార్పు, పలుచోట్ల రిజిస్టర్ చేయించుకోవడం, ఇతర అనర్హత కారణాల వల్ల ఓటర్ల తొలగింపు జరిగిందని, కొత్త ఓటర్లకు జాబితాలో చోటు కల్పించామని ఈసీ తెలిపింది. ఎన్నికల జాబితా అప్‌డేట్ అనేది నిరంతర పక్రియ అని, అర్హత కలిగిన పౌరులు అప్లయ్ చేసుకోవడం, ఎంట్రీల కరెక్షన్ వంటివి చేసుకోవచ్చని పేర్కొంది.

# గ్రామీణ ప్రాంతాల్లో గడచిన 12 ఏండ్లల్లో ఒక్క ఇల్లు కూడా లేదు

(మొదటి పేజీ తరువాయి)

విస్మరించిన ఆనాటి ప్రభుత్వం పది సంవత్సరాలల్లో కేంద్రం నుండి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాలకు ఇండ్లు మంజూరు చేయాలని గడిచిన రెండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాం. కానీ కేంద్రం నుంచి సానుకూల స్పందన రావడం లేదు. కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా గ్రామీణ ప్రాంతాలకు 3 లక్షల ఇండ్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా శనివారం హైదరాబాద్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గృహ నిర్మాణానికి సంబంధించి పలు అంశాలను ప్రస్తావించారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో గృహ నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పది సంవత్సరాలలో సంవత్సరానికి కనీసం పదివేల ఇండ్లను కూడా నిర్మించలేదు. పైగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రెండేళ్ల క్రితం రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన మా ప్రభుత్వం పేదల ఇండ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. వచ్చే మూడు సంవత్సరాలలో రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఈ ఏడాది దాదాపు నాలుగు లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం చేయూతనిస్తే ఈ కార్యక్రమం మరింత వేగవంతం అవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం గతంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ 1.0లో భాగస్వామ్యం కాలేదు. తెలంగాణ రాష్ట్రంలో గత 12 ఏళ్లలో ఏర్పడిన పెండింగ్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలోని పరిస్థితులను అర్థం చేసుకొని ఈ ఆర్థిక సంవత్సరములో 3 లక్షలు, వచ్చే ఏడాది మరో రెండు లక్షల ఇండ్లను మజూరు చేయాలని' మంత్రి పొంగులేటి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కి విజ్ఞప్తి చేశారు. పేద కుటుంబాలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, పేదలకు సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, ఈ లక్ష్య సాధనలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆదివారం, ఫిబ్రవరి 22, 2026

RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

తెలుగు దిన పత్రిక

## సమాజ సేవలో ఆశా వర్కర్ల పాత్ర ఎంతో కీలకం

**- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్.**



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 21:-
కంటోన్మెంట్ ఆశా వర్కర్ల సమస్యలను, వారి పనితీరుపై, నియోజకవర్గంలో వారికి కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు ఏమేం చర్యలు తీసుకోవాలో తెలుసుకోవడానికి శనివారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ బాలంరాయి లోని లీ ప్యాలెస్ లో ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ..నియోజకవర్గంలో అంగన్వాడీ కేంద్రాలు ఎక్కడ అవసరం ఉన్నాయో దృష్టికి తీసుకువస్తే వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. కరోనా సమయంలో ఆశా వర్కర్ల సేవలు అమోఘమని,దేశ సైనికులు ఈ దేశానికి ఎంత సేవ చేస్తున్నారో మీ సేవలు కూడా అంతేనని వారిని అభినందించారు. గత ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించకపోవడంతో వ్యవస్థ దెబ్బతిన్నదని, దానిని సరిచేసి ప్రజాపాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో గాడిన పెడుతుందని, మీకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల ఆర్థిక పరమైన విషయాల్లో అండగా ఉంటానని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మీ ఇబ్బందులు తొలిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే వారితో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ తో పాటు ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## గవర్నమెంట్ హాస్పిటల్ లో వైద్యుల కొదవతో చిన్నారి మృతి



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి21:-రంగారెడ్డి జిల్లా యాచారం గవర్నమెంట్ హాస్పిటల్లో డాక్టర్లు లేని కొదవతో చిరు ప్రాణి బలి కావడం జరిగింది. దానికి సంబంధించి హాస్పిటల్ సూపరిడెంట్ తో మాట్లాడితే తెలిసిన వివరాలు ఏమిటంటే మల్కీస్ కూడా గ్రామానికి చెందిన కృష్ణయ్య లాస్య దంపతులు రెండవ కాన్పుకై ఆసుపత్రిలో చేరితే అర్ధరాత్రి సమయంలో సరైన వైద్య సౌకర్యాలు లేక డాక్టర్స్ లేక చిన్నారి మృతి చెందడం జరిగింది. యాచారం మండలం టిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు సయ్యద్ జానీ వార్డ్ మెంబర్లు సాజిత్, జోగు అంజయ్య, సూపర్డెంట్నని కలిసి మరల ఇలాంటి ఒక సంఘటన జరగకూడదని తెలియజేశారు. అదేవిధంగా దీనికి సంబంధించినటువంటి హాస్పిటల్లో సిబ్బంది కొరత లేకుండా చూసుకోవాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ ఎస్ నాయకులు ఎలిమినేటి ప్రశాంత్, జావిద్ తదితరులు బాధితురాలి కుటుంబ సభ్యులు ఉన్నారు.

## మహిళా సమాఖ్య భవనా నిర్మాణానికి భూమి పూజ చేసిన సీతారాంపురం గ్రామ సర్పంచ్ మరియు పాలక వర్గం.





హైదరాబాద్ ఎస్టేట్ 21 02 2026 గుండాల : సీతారాంపురం
తెలంగాణా లో మహిళా సంఘం సహాయక సంఘాలు సమాఖ్య కోసం తెలంగాణా ప్రభుత్వం ప్రతి గ్రామం లో 10 లక్షల అంచనా వ్యయం తో మహిళా సమాఖ్య భవనాలు నిర్మిస్తుంది. అందులో సుమారు 552 చదరపు అడుగుల విస్తీరణలో, సమావేశాలు, శిక్షణ ఉపాధి కార్యకలాపాలు, మరియు ఉత్పత్తుల ప్రదర్శన కోసం శాశ్వత వేదికలుగా పనిచేస్తాయి. అందులో భాగంగా మన గ్రామంలో కూడా మహిళా బావన్ నిర్మాణం మంజూరు అయినందున ఈరోజు పంచాయితీ శాఖ అధికారి ఏ ఈ సుధాకర్ సమక్షంలో మరియు గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్,, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో నూతన భవనానికి భూమి పూజ చేయడం జరిగింది. ఇట్టి భావన నిర్మానికి సహకరించిన ప్రభుత్వ అధికారులకు మరియు స్థల దాత కు గ్రామ పాలవర్గం తరుపున సర్పంచ్ ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ కాళీ పద్మ వెంకన్న, ఉపసర్పంచ్ మల్లెపాక నరేష్, ఏ ఈ సుధాకర్, స్థల దాత వెంకటేష్, సంఘ బంధం అధ్యక్షురాలు ఆగమ్మ, మరియు అహిమావతి, వార్డు మెంబర్స్, బెంజారి లలితా, పాసిల్ల శ్రీను, మాలిపేద్ది సుమతి, మాటూరు శేఖర్, పాలడుగు పోచమ్మ, నాయకులు మచ్చ మల్లారెడ్డి మొగిలిపాక భాస్కర్ తదితరులు పాలొగొన్నారు

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మరియు జాతీయ కార్యదర్శి శ్రీ పిట్ట వరప్రసాద్ గారు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డా. మోహన్‌లాల్ పాటిల్ నివాసానికి భోపాల్‌లో మర్యాదపూర్వకంగా వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని పరామర్శించారు.

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి విజయవాడ డా. మోహన్‌లాల్ పాటిల్ గారు రెండు మోకాళ్లకు



శస్త్రచికిత్స చేయించుకుని ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా శ్రీ పిట్టా వరప్రసాద్ ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పార్టీ తరపున శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నిర్వహణ, భవిష్యత్ కార్యక్రమాలపై కూడా సానుకూలంగా చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో భోపాల్ నగర పార్టీ నాయకులు శ్రీ దళిత్ బన్సోడ్, శ్రీ సతీష్ సోమ్‌కుమార్, శ్రీ నరేంద్ర గడ్వాయిలే మరియు శ్రీ రాహుల్ మెశ్రామ్ పాల్గొన్నారు. డా. మోహన్‌లాల్ పాటిల్ గారు త్వరగా పూర్తిగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని నాయకులు ఆకాంక్షించారు.

# జాతీయ స్థాయిలో ఏ ఐ సమ్మిట్ 2026








Address by Chief Guest Gopala Krishna Kuppuswamy
Co-Founder of Cognida.ai Hyderabad to students and faculty
of Guru Nanak Institutions on the occasion of AI Summit held in the campus

(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి21:-
రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ ఇబ్రహీంపట్నం సమీపంలోని గురు నానక్ విద్య సంస్థలో ఇంజనీరింగ్ విద్యార్థులలో కృత్రిమ మేధస్సు (ఇంటలిజెన్స్), నూతన ఆవిష్కరణలు, పరిశోధనలను ప్రోత్సహించే దిశగా విద్యార్థులు, పరిశోధకులకు తమ వినూత్న ఆలోచనలు, కొత్త పరిశోధనా ఫలితాలు మరియు ఎఐ రంగంలోని స్టార్టప్ అవకాశాలను పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, స్టార్టప్ ఎక్స్‌పో ద్వారా వేదికను కల్పించడం, యూ జి, పి జి విద్యార్థుల కోసం జాతీయ స్థాయిలో ఏ ఐ సమ్మిట్ ను నిర్వహించడం జరిగింది. ఈ సమ్మిట్‌లో వివిధ విద్యాసంస్థలు, రాష్ట్రాల నుండి 200కి పైగా బృందాలు, 600కు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా గోపాలకృష్ణ కుప్పుస్వామి (సహ వ్యవస్థాపకులు,కాగ్నిడా .ఎఐ హైదరాబాద్) పాల్గొని ఎఐ ఆధారిత వ్యాపారాలు, పరిశ్రమల మార్పుపై ప్రసంగిస్తూ విద్యార్థులు తమ రంగ నైపుణ్యాన్ని ఎఐ సామర్థ్యాలతో కలిపి విస్తృత స్థాయిలో స్టార్టప్‌లు నిర్మించాలని, సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా మారుతూ ఉండాలని సూచించారు. అతిథిగా డా. ప్రవీణ్ గొర్ల (ప్రిన్సిపల్ రీసెర్చ్ ఏ వ్లశ్వం .ఎఐ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు, స్వేచ్ఛ తెలంగాణ ) పాల్గొని జనరేటివ్ ఎఐ, ఓపెన్ ఎఐ పరిశోధనలపై ప్రసంగించారు. విద్యాస ంస్థల వైస్ చైర్మన్, గురు నానక్ యూనివర్సిటీ ఛాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ సదస్సును ఉద్దేశించి మాట్లాడుతూ ఏ ఐ ప్రాముఖ్యత గురుంచి ప్రసంగించారు. విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్, గురు నానక్ యూనివర్సిటీ ఉపకులపతి డా. హెచ్.ఎస్. సైనీ ఏ ఐ పరిశోధనలపై సంక్షిప్తంగా వివరించారు.డా. శ్రీనాథ రెడ్డి , డైరెక్టర్, డా. రిషి సయాల్ అసోసియేట్ డైరెక్టర్, ఎస్. మధు (హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్, ఆల్మల్ /ఎఐ, డిఎస్/ఐఒటి) పాల్గొని ప్రసంగించారు. వాల్యుయేటర్లుగా వి. కిషోర్ (ప్రాజెక్ట్ మేనేజర్, విప్రో టెక్నాలజీ), డా. రామకృష్ణ (ప్రొఫెసర్, సిబిట్ ), డా. టి. మమత (ప్రొఫెసర్, శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) వ్యవహరించారు. తదనంతరం విజేతలకు అతిథులు బహుమతుల ప్రదానం చేసారు.

# వివిధ వివాహ వేడుకలలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే


(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి21:-
మన్నెగూడలోని బిఎంఆర్ సార్థ కన్వెన్షన్‌లో గాంధీభవన్ పిఆర్ఓ హరిప్రసాద్ కుమార్తె డాక్టర్ తేజస్విని వివాహ వేడుకకు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగా రెడ్డి, తెలంగాణ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, హాజరై వధూవరులకు ఆశీర్వాదాలు అందజేశారు. అనంతరం బొంగుళూరులోని ప్రమిద కన్వెన్షన్‌లో నిర్వహించిన మరో వివాహ వేడుకకు హాజరై, నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో గడ్డిఅన్నారం ఏఎంసి ఛైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, డైరెక్టర్లు పన్యాల జైపాల్ రెడ్డి, మెగావత్ గణేష్ నాయక్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గురునాథ్ రెడ్డి, లిక్కి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఓబాపు కాంగ్రెస్ ప్రభుత్వానికి జ్ఞానం ప్రసాదించు

**మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రి.**

(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి21:-
మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం మండలం దిల్వార్‌గూడ గ్రామంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.."గాంధీజీ కన్న కలలు, ఆశయాలను ఆచరించినప్పుడే దేశం సుభిక్షంగా, శాంతియుతంగా ముందుకు సాగుతుంది. కానీ నేటి తెలంగాణ రాష్ట్రంలో మహనీయుల ఆశయాలను తుంగలో తొక్కుతూ, హింసను ప్రేరేపిస్తూ, అబద్ధపు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పాలిస్తోంది. ఓ బాపూ... నువ్వైనా చెప్పు ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇకనైనా బుద్ధి తెచ్చుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మీ సాక్షిగా హెచ్చరిస్తున్నాం" అని తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, మాజీ సర్పంచులు, నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలేవి

**- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ.**

**- కుంటని మాయం చేస్తున్న పట్టించుకోని అధికారులు.**

(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి21:-
అబ్దుల్లాపూర్ మండల పరిధిలోని హత్తిగూడా రెవిన్యూ సర్వే నంబర్ 19 మరియు హయత్ నగర్ మండల పరిధిలోని సర్వే నంబర్ 98 లో కలిపి సుమారు 6 ఏకరాల విస్తీర్ణంలో గల కుంటని నుండి ఆయకట్టుకి వెళ్లే నాలని పూడ్చి పక్కనే ఉన్న 2.5 ఎకరాల బిల్ల దాఖల భూమి, ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెంచర్ వేసి విల్లాలు నిర్మాణం చేస్తున్న కబ్జా కోరులపై రెవిన్యూ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవటం లేదని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి అన్నారు. అబ్దుల్లాపూర్ మెట్ మరియు హయత్ నగర్ మండలాల పరిధిలో కబ్జా కి గురైతున్న చిన్న కుంటని, దాని నాలాని శనివారం నాడు భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ మరియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, వారి పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అందొజు రవీంద్ర చారీ మాట్లాడుతూ.. తక్కువ విస్తీర్ణంలో గల ప్రైవేట్ భూమిని సాకుగా చూపి హత్తిగూడా చిన్న కుంటని, దాని నాలాని పూడ్చి నాలా స్థలంలో అక్కడి భూస్వామి అక్రమంగా విల్లాల నిర్మాణం చేపడుతున్నాడు. కొన్ని కోట్ల రూపాయల విలువ చేసి ఈ భూమిపై కన్నేసిన సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారి (భూస్వామి) రెవిన్యూ అధికారులని మోసం చేస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తూ పబ్బం గడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలాని డిమాండ్ చేశారు. ఇదే విషయంలో 2023 లో సంబంధిత అధికారులకి ఫిర్యాదు చేయటం కొంత కాలం పనులని నిలిపివేయగలిగాం. తిరిగి ఇప్పుడు పనులు ప్రారంభం కావటం వల్ల ఈ నెల 16 నాడు హైడ్రా కమిషనర్ రంగనాథ్ కి కూడా ఫిర్యాదు చేశామని. ఇప్పటి వరకు కూడా ఎలాంటి చర్యలు వారిపై తీసుకోక పోగ కనీసం నిర్మాణాలని కూడా అపకపోవటం అనుమానంగా ఉందన్నారు. ప్రభుత్వ భూముల్లో నీరుపేదలు గుడిసెలో వేసుకుంటే వెంటనే అడ్డుకునే రెవిన్యూ అధికారులు ఇక్కడ నాలా అంత కబ్జాకి గురైన కూడా ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం అవుతుందని అన్నారు. హత్తిగూడా చిన్న కుంట చాలా పురాతమైనదని ఎల్ బి నగర్ సర్కిల్ పరిధిలోని అనేక కాలానిల వర్షపు నీరు ఈ కుంటలోకె చేరుతుంది. ఈ కుంట నుండి అలుగు పోయటం ద్వారా ఆయాకట్టుకు చేరటానికి ఉన్న నాలానే ఇప్పుడు పూర్తిగా కనుమరుగు అయింది దాని స్థానంలో వెంచర్ చేసి నిర్మాణాలు కడుతున్నారు. కాబట్టి రెవిన్యూ మరియు,నీటిపారుదల శాఖ అధికారులు, తక్షణమే స్పదించి సర్వే చేయించి కబ్జాకి గురైన కోట్ల రూపాయల విలువ చేసే 5 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆయకట్టు నాలాని రక్షించి కుంటకి పూర్వ వైభవం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి,రంగరెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, అబ్దుల్లాపూర్ మెట్ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్,బిఓసి జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్,సిపిఐ నాయకులు వడ్త్యా రమేష్ నాయక్,పేరాల గోపి,నిరంజన్, ఉప్పలయ్య,అశోక్,పాండు, ప్రియా,అన్నపూర్ణ, రాజు,విరమల్లు,మాల్యార్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.





RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

హైదరాబాద్ ఎస్టేట్

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

తెలుగు దిన పత్రిక

# పేదల సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పం

**- గ్రామీణ ప్రాంతాలలో గడచిన 12 ఏండ్లల్లో ఒక్క ఇల్లు కూడా మంజురు చేయలేదు.**

(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి21:-
తెలంగాణ ప్రాంత ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా 2014-23 వరకు దాదాపు పది సంవత్సరాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పేదల ఇండ్ల నిర్మాణం జరగలేదు. దీంతో ఇండ్ల నిర్మాణానికి ప్రజల నుంచి భారీ ఎత్తున డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన ఇండ్లను మంజూరు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పేదల సంక్షేమాన్ని విస్మరించిన ఆనాటి ప్రభుత్వం పది సంవత్సరాలల్లో కేంద్రం నుండి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. కానీ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాలకు ఇండ్లు మంజురు చేయాలని గడిచిన రెండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాం. కానీ కేంద్రం నుంచి సానుకూల స్పందన రావడం లేదు. కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా గ్రామీణ ప్రాంతాలకు 3 లక్షల ఇండ్లు మంజురు చేయాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా శనివారం హైదరాబాద్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గృహ నిర్మాణానికి సంబంధించి పలు అంశాలను ప్రస్తావించారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. గత



ప్రభుత్వం రాష్ట్రంలో గృహ నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పది సంవత్సరాలలో సంవత్సరానికి కనీసం పదివేల ఇండ్లను కూడా నిర్మించలేదు. పైగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రెండేళ్ల క్రితం రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన మా ప్రభుత్వం పేదల ఇండ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. వచ్చే మూడు సంవత్సరాలలో రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఈ ఏడాది దాదాపు నాలుగు లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజురు చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం చేయూతనిస్తే ఈ కార్యక్రమం మరింత వేగవంతం అవుతుంది.తెలంగాణ రాష్ట్రం గతంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ ( పి ఎం ఏ వై-జీ) 1.0లో భాగస్వామ్యం కాలేదు. అయితే 2023 తరువాత మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎం ఓ ఆర్ డి) మార్గదర్శకాల ప్రకారం పి ఎం ఏ వై -జీ 2.0 లో రాష్ట్రం అధికారికంగా చేరింది. 2024 ఆగస్టులో కేంద్ర మంత్రివర్గం పిఎంఏవై -జీ 2.0కు ఆమోదం తెలిపి, ఆవాస్ం2018 సర్వే నవీకరణ తర్వాత సాచురేషన్ పద్ధతిలో గృహాల మంజూరు చేయాలని నిర్ణయించినప్పటికీ, పాత డేటా ఆధారంగా 2024-25, 2025-26 సంవత్సరాలకు ఇతర రాష్ట్రాలకు 1.19 కోట్ల గృహాలను కేటాయించింది. తెలంగాణ రాష్ట్రం పి ఎం ఏ వై 1.0 లో భాగస్వామ్యం కాకపోవడంతో 2018 పెండింగ్ డాటా లేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ విస్తృత సర్వే నిర్వహించి అర్హులైన లబ్ధిదారుల డేటాబేస్‌ను సిద్ధం చేసుకుంది. అయినప్పటికీ, కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఆవాస్ం2024 మొబైల్ యాప్ ద్వారా మరోసారి సర్వే నిర్వహించి మొత్తం 11.57 లక్షల అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో గత12 ఏళ్లలో ఏర్పడిన పెండింగ్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలోని పరిస్థితులను అర్థం చేసుకొని ఈ ఆర్థిక సంవత్సరములో 3 లక్షలు, వచ్చే ఏడాది మరో రెండు లక్షల ఇండ్లను మజూరు చేయాలని మంత్రి పొంగులేటి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కి విజ్ఞప్తి చేశారు.పేద కుటుంబాలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, పేదలకు సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, ఈ లక్ష్య సాధనలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి21:-
రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ గా (స్థానిక సంస్థలు) ప్రతిమా సింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ గా కొనసాగిన ప్రతిమాసింగ్ ప్రసూతి సెలవులపై వెళ్ళడం జరిగినది. తేదీ: 20-02-2026 శుక్రవారం నాడు తిరిగి అదనపు కలెక్టర్ గా (స్థానిక సంస్థలు) బాధ్యతలు స్వీకరించారు.

## సోమవారం నుండి యధావిధిగా ప్రజావాణి కార్యక్రమం



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి21:-
ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 23వ తేదీ (సోమవారం) నుండి యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ సి.నారా యణ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యధావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

# చైర్మన్ వైస్ చైర్మన్ పదవి స్వీకార మహోత్సవానికి హాజరైన భువనగిరి ఎమ్మెల్యే





(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి21:-
భూదాన్ పోచంపల్లి పురపాలక నూతన గ ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ లను పదవి బాధ్యత స్వీకార మహోత్సవ సందర్భంగా హాజరైన భువనగిరి ఎమ్మెల్యే కుమార్ రెడ్డి.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజాపాలనతోనే పట్టణాల్లో గ్రామాల పూర్తిస్థాయి అభివృద్ధి జరుగుతుందని ఆయన తెలిపారు.పోచంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిలో ఇప్పటికే 49 కోట్ల రూపాయల నిధులు తో మినీ ట్యాంక్ బండ్ నిర్మాణంతో చేపట్టామని ఆయన అన్నారు. మున్సిపల్ప్రజలకు 24 గంటల వైద్య సదుపాయం కోసం జిల్లా వైద్యాధికారులను మాట్లాడంతో పాటు ఈ సమస్యపై త్వరలోనే శాసనసభలో దృష్టికి తేనున్నామని ఆయన అన్నారు. 30 పడకల ఆసుపత్రి కోసం మంజూరు చేయడానికి కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. పోచంపల్లి బస్సుల కొరత లేకుండా అన్ని విధాలు చర్యలు తీసుకుంటాం, అదేవిధంగాఇక్కడ గ్రామీణ యువతకు ఉద్యోగ కల్పన చేయడానికి కూడా కృషి చేస్తున్నామని ఆయన అన్నారు.

## అమరుల స్థూపానికి పులాభిషేకం.. సీఎం రేవంత్ రెడ్డి కి పాలాభిషేకం



హైదరాబాద్, ఫిబ్రవరి 21: తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి ఆధ్వర్యంలో శనివారం అసెంబ్లీ ఎదురుగా గన్ పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి పులాభిషేకం, సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీ కి తెలంగాణ ఉద్యమకారులు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా తెలంగాణ ఉద్య మకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టో లో పెట్టిన విధంగా మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లు ప్రెస్ లో మాట్లాడుతూ గతంలో చెప్పిన విధంగానే తెలంగాణ ఉద్యమ కారులకు 250 గజ ముల ఇంటి స్థలం ఇస్తామని ప్రకటించారు. ఈనెలాఖరులో సబ్ కమిటీ ఏర్పాటు చేసి, ఉద్యమ కారులకు ఏమేమి కావాలో అన్ని చేస్తామని చెప్పినారు. అందుకు ఉద్యమకారులు అందరూ సంతో షిస్తూ.. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం కట్టుబడి ఉండాలని సుల్తాన్ యాదగిరి మాట్లాడారు. అందుకు గౌరవ సీఎం రేవంత్ రెడ్డి కి ఉద్యమ కారుల తరపున కృతజ్ఞతలు తెలియ చేశారు. కార్యక్రమంలో ఉద్యమ జేఏసీ నాయకులు మోత్కూరు మల్లేష్, అనుముల రవీందర్, రాజు, జానకి రెడ్డి , గిరిబాబు, రాజయ్య, జి. యాదగిరి, కె శ్యామల, డి. వెంకట లక్ష్మీ, భాగ్య, పి.కమల, వి.అరు ణ, దేవుడు, ఏ.సమ్మయ్యా, రమేష్, డి.కోటేశ్వరరావు , నారాయణ,సామ్యూల్, ఉద్యమకారులు పాల్గొన్నారు.

# మంచిరెడ్డి కిషన్ రెడ్డి పై తప్పుడు ఆరోపణ మానుకోవాలి

**- బీసీ,ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనారిటీ ల పక్షపతి మంచి రెడ్డి కిషన్ రెడ్డి బీసీ నాయకులు.**

**- ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బిఆర్ఎస్ వి విద్యార్థి విభాగం అధ్యక్షులు నిట్టు జగదీశ్వర్.**

(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి21:-
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బి ఆర్ ఎస్ వి విద్యార్థి విభాగం అధ్యక్షులు నీట్టు జగదీష్ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పై తప్పుడు ఆరోపణలు మానుకోవాలి, పూటకు ఒకసారి ఇష్టానుసారంగా పదవి ఆశతో మంచిరెడ్డి పై తప్పుడు ఆరోపణలు చేస్తున్న కౌన్సిలర్ ఆకల యాదగిరి ని ఇబ్రహీంపట్నం మున్సిపల్టి ప్రజలు క్షమించరు. తెలంగాణ రాష్ట్రం లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ని అభివృద్ధి పథంలో నియోజకవర్గ ప్రజలు గర్వపడేలా అభివృద్ధి చేశాన ఘనత మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డిదే. కాంగ్రెస్ నాయకుల కనుచూపులో పనిచేస్తూ మంచిరెడ్డి పై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్న ఆకుల యాదగిరి కి ప్రజలే బుద్ధి చెప్తారు. మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో కార్యకర్తలను అటు ప్రజలను సమన్వయం చేసుకొని అధికార పార్టీ కాదని13 సీట్లు గెలిపించుకున్న ఘనత మంచిరెడ్డి ప్రశాంత్




కుమార్ రెడ్డి కే దక్కుతుంది అని అన్నారు.నీకు దమ్ముంటే 19వ వార్డులో కౌన్సిలర్ పదవి కి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి చేర్మెన్ పదవి తీస్కో అని ఆకుల యాదగిరి కి యూత్ నాయకుల మున్సిపల్ అధ్యక్షులు మడుపు శివ సాయి అన్నారు. వెన్నుపోటుకు మరోపేరే ఆకుల యాదగిరి. మున్సిపల్ వైస్ చేర్మెన్ గా ఉండి సొంత వార్డ్ కి ఇటు పార్టీ కి చేసిన సేవలు చేసది ఏమి లేదు. దమ్ముంటే 42 రిజర్వేషన్ పై రాష్ట్ర బీసీ నాయకలు మొత్తం కాంగ్రెస్ ప్రభుత్వం పై పోరాడాలి. మరోసారి మంచిరెడ్డి పై మంచి రెడ్డి కుటుంబ సభ్యులకు ఆరోపణలు చేస్తే సహించేదేలని ఈ సందర్భంగా వారు సూచించారు. బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో జరిగిన ఈ పత్రిక సమావేశంలో బీసీ సెల్ నాయకులు కాకి రవీందర్ ముదిరాజ్, కొంద్రు మహేష్, యాచారం సురేష్, కాకి సంతోష్ ముదిరాజ్,బన్నీ గౌడ్, గుర్జని యాదగిరి గౌడ్, ఎరుపుల అశోక్ ,దేవేందర్ గౌడ్, పాల్గొన్నారు.

## డాక్టర్ విఠల్ జోషికి మహాకవి పంపన భాషా సేవ విశిష్ట పురస్కారం ప్రధానం




హైదరాబాద్, ఫిబ్రవరి 21: అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని అక్షరయాన్ విమెన్ రైటర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం బేగంపేట లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కన్నడ సాహిత్య పరిషత్ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ విఠల్ జోషి కి మహాకవి పంపన భాషా సేవా విశిష్ట పురస్కారాన్ని మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్ రావు ప్రధానం చేశారు. కన్నడ, తెలుగు భాషాభివృద్ధికి విఠల్ జోషి అందిస్తున్న సేవలను గుర్తించి మహాకవి పంపన భాషా సేవ విశిష్ట పురస్కారాన్ని అందజేసినట్లు అక్షరయాన్ విమెన్ రైటర్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అయినంపూడి శ్రీలక్ష్మీ తెలిపారు. అవార్డు అందుకున్న అనంతరం విఠల్ జోషి మాట్లాడుతూ.. తెలుగు, కన్నడీయులను మరింతగా ఐక్యం చేయడానికి ఈ అవార్డు దోహదపడుతుందని పేర్కొన్నారు. అవార్డును అందుకోవడంతో తన బాధ్యతను మరింత పెంచినట్లయిందని ఆయన అన్నారు. భవిష్యత్ లో కన్నడ, తెలుగు భాషల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# నిజాయితీ మన వ్యక్తిత్వాన్ని మెరుగుపరుస్తుంది

(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి21:-
నిజాయితీ మన వ్యక్తిత్వాన్ని మెరుగుపరుస్తుందని, సమాజంలో మనకు గౌరవం తెస్తుంది అని కురుమిద్ద ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తు పాండురంగారెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీ సభ్యురాలు సంతోషిని ప్రియ పాఠశాలను సందర్శించిన సందర్భంగా మూడు లక్షల విలువైన బంగారు ఉంగరాన్ని పాఠశాల ఆవరణలో పోగొట్టుకున్నారు. తొమ్మిదవ తరగతి చదువుతున్న దండె విక్రమ్ తనకు దొరికిన ఉంగరాన్ని నిజాయితీగా ఉపాధ్యాయులకు అప్పగించారు. దానిని ఉపాధ్యాయులు వార్డు సభ్యురాలికి అందజేసిన సందర్భంగా విక్రమ్ ను ఘనంగా నగదు బహుమతితో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మనమందరం చిన్నప్పటి నుంచే నిజాయితీని అలవాటు చేసుకోవాలని, ఇతరుల వస్తువులను అనుమతి లేకుండా తీసుకో కపోవడం, చేసిన తప్పును ఒప్పుకోవడం ఇవన్నీ నిజాయితీ లక్షణాలు అని తెలిపారు. నిజాయితీ ఉన్న వ్యక్తి ఎప్పటికీ భయపడడు అని అన్నారు. విలువైన ఉంగరాన్ని నిజాయితీగా అప్పగించిన విక్రమ్ ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందిం చారు. ఈ కార్యక్రమం



లో గ్రామ వార్డు సభ్యులు సంతోషిని ప్రియ, ఉపాధ్యాయులు స్వప్న, రాణి, శ్రీనివాస్, అశోక్, వీరమణి, శ్రీదేవి పాల్గొన్నారు.

## సీఐ మధు కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రజాసంఘాల నాయకులు



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి21:= రంగారెడ్డి జిల్లా మంచాల సీఐ మధు జన్మదినం సందర్భంగా, శుభాకాంక్షలు తెలిపిన ప్రజాసంఘాల అధ్యక్షులు కంబాలపల్లి భాస్కర్, జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పల్నాటి యాదయ్య ఇబ్రహీంపట్నం ఉపాధ్యక్షులు.. జీ.ూా.జ మంచాల మండల జేఏసీ తదితరులు ఉపాధ్యక్షులు దంచుక బిక్షపతి, వార్డ్ మెంబర్ లింగంపల్లి ఏ సురేష్, బాల్రాజ్, రాఘువ, కాంగ్రెస్ పార్టీ నాయకులు శివ లింగం, తదితరులు పాల్గొని సీఐ మధుకి శాలువా కప్పి స్వీట్లు తినిపించారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# కంటోన్మెంట్ విలీన పోరాటంలో మొదటి విజయం





(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి21:- ఎమ్మెల్యే శ్రీగణేష్ విజ్ఞప్తిపై స్పందించిన భారత రాష్ట్రపతి కార్యాలయం.సికింద్రాబాద్: కంటోన్మెంట్ ప్రజల చిరకాల స్వప్నమైన సివిల్ ఏరియాల విలీనం (ఎక్సిసిషన్,మెర్జెర్) ప్రక్రియలో ఒక ప్రధాన అడుగు పడింది. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఫిబ్రవరి 1, 2026న సమర్పించిన అధికారిక వినతి పత్రంపై భారత రాష్ట్రపతి కార్యాలయం (రాష్ట్రపతి భవన్) సానుకూలంగా స్పందించింది.ఎమ్మెల్యే శ్రీగణేష్ లేవనెత్తిన అంశాల తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్రపతి సెక్రటేరియట్, ఈ ఫైల్ను నో.17/13/2026-రా(×)) తదుపరి చర్యల కోసం భారత రక్షణ శాఖ కార్యదర్శికి (డిఫెన్స్ సెక్రటరీ ) పంపింది. జనవరి 20 నుండి 27 వరకు ఎమ్మెల్యే శ్రీగణేష్ చేపట్టిన 8 రోజుల రిలే నిరాహార దీక్ష మరియు కంటోన్మెంట్ ప్రజల ఆవేదనను ఈ వినతి పత్రం ద్వారా రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లారు .రక్షణ శాఖ నుండి కంటోన్మెంట్ బోర్డుకు రావాల్సిన ?1,200 కోట్ల సర్వీస్ ఛార్జీల బకాయిల వల్ల పౌర సేవలు కుంటుపడుతున్నాయని ఎమ్మెల్యే తన వినతి పత్రం ద్వారా రాష్ట్రపతికి వివరించారు. 2021 నుండి ఎన్నికలు లేక 'నామినేటెడ్' పాలనలో మగ్గుతున్న 4 లక్షల మంది ప్రజలకు, రాబోయే జీహెచ్ఎంసీ ( జిహెచ్ఎంసి) ఎన్నికల్లో కంటోన్మెంట్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేసి ఓటు వేసే అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. రాష్ట్రపతి కార్యాలయం డిఫెన్స్ సెక్రటరీకి లేఖ రాయడం పై ఎమ్మెల్యే శ్రీగణేష్ శనివారం తన క్యాంపు కార్యాలయంలో స్పందిస్తూ, ఇది కంటోన్మెంట్ ప్రజల ఆత్మగౌరవ పోరాట విజయం. మా విన్నపాన్ని రక్షణ శాఖ కార్యదర్శికి పంపడం ద్వారా రాష్ట్రపతి కార్యాలయం మా సమస్య పరిష్కారానికి మార్గం సుగమం చేసింది. విలీన ప్రక్రియపై తక్షణమే తుది గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్పుడే మా ప్రజలకు పూర్తిస్థాయి ప్రజాస్వామ్య హక్కులు లభిస్తాయని అన్నారు. రాష్ట్రపతి కార్యాలయం నుండి వచ్చిన ఈ స్పందనతో ఇప్పుడు కేంద్ర రక్షణ శాఖపై ఒత్తిడి పెరిగిందని. విలీన ప్రక్రియను వేగవంతం చేసి, సివిల్ ఏరియాలను జీహెచ్ఎంసీలో కలిపే వరకు ఈ పోరాటం ఆగదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# ఓపెన్ ఇంటర్ పరీక్షల టైమ్‌టేబుల్ విడుదల..



హైదరాబాద్ : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ 2026 సంవత్సరానికిగానూ 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల టైమ్‌టేబుల్‌ను విడుదల చేసింది. పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు ఇప్పుడు పూర్తి షెడ్యూల్‌ను చూసుకోవాలని సూచించింది. షెడ్యూల్‌ను పూర్తిగా తేదీల వారీగా పరిశీలించుకోవాలని పేర్కొన్నది.తాజా టైమ్‌టేబుల్ ప్రకారం.. పదో తరగతి, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు ఏప్రిల్ 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో జరగనున్నాయి. ఉదయం షిఫ్ట్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సాగనుంది. ఆ తర్వాత ఏప్రిల్ 28 నుంచి మే 5వ తేదీ వరకు ఇంటర్నల్స్, ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి.

# కామారెడ్డిలో హైటెన్షన్.. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ దగ్గర బీజేపీ, కాంగ్రెస్ నేతల ఫైట్



కామారెడ్డి : కామారెడ్డి జిల్లా కేంద్రంలో హైటెన్షన్ నెలకొంది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మధ్య మాటల యుద్ధం ఉద్రిక్తతలకు దారితీసింది. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ నేత గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ప్రయత్నించారు.ప్రభుత్వ, అరోరా కాలేజీ భూములను వెంకట రమణారెడ్డి కబ్జా చేశారని షబ్బీర్ ఇటీవల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన వెంకట రమణారెడ్డి.. ప్రభుత్వ కాలేజీ భూములు, శిశుమందిర్ పాఠశాల, అరోరా కాలేజీ విషయంలో కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలపై తాను చర్చకు సిద్ధమని తెలిపారు. కాంగ్రెస్ ప్రజలకు నిజాలు తెలియాల్సిన అవసరం ఉందని.. సాక్ష్యాధారాలతో చర్చకు రావాలని ఎమ్మెల్యే సవాలు విసిరారు. ఈ నేపథ్యంలో శిశు మందిర్ వేదికపై బహిరంగ చర్చకు రెండు పార్టీలు సిద్ధమయ్యాయి. ఇరు పార్టీల నేతల సవాళ్లతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి క్యాంప్ ఆఫీసు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. క్యాంప్ ఆఫీసు నుంచి బయటకు రాకుండా ఎమ్మెల్యేను హౌస్ అరెస్టు చేశారు.మరోవైపు సవాలును స్వీకరించిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. మాజీ సర్పంచ్ గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారు. ఈ విషయం తెలిసిన బీజేపీ కార్యకర్తలు అక్కడకు చేరుకుని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ముదరడంతో మహేందర్ రెడ్డి కారుపై బీజేపీ కార్యకర్తలు దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. కారును బోల్తా పడేశారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇరు పార్టీల నేతలను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. పరిస్థితి అదుపు తప్పడంతో కాంగ్రెస్ నేత మహేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# సిద్దిపేట కలెక్టరేట్‌లో రైతు మృతిపై నివేదిక పంపించండి.. చీఫ్ సెక్రటరీకి ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశం




కాళేశ్వరం:కాళేశ్వరం ప్రాజెక్టు కెనాల్ నిర్మాణంలో భాగంగా రామకృష్ణయ్య (55) అనే రైతు తన రెండు ఎకరాలు భూమిని ప్రభుత్వం తీసుకోగా.. దానికి సంబంధించిన 29 లక్షల భూ పరిహారం కోసం గత సంవత్సరం సిద్దిపేట కలెక్టరేట్‌కు వెళ్లి అధికారులు సరిగా స్పందించకపోవడంతో కలెక్టరేట్‌లో అధికారుల కోసం రోజుల తరబడి తిరుగుతూ, వేచి చూస్తూ ఆగస్టు 21న కలెక్టర్‌లోనే గుండె పోటుతో ప్రాణాలు విడిచిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది, సామాజికవేత్త కారుపోతుల రేవంత్ గౌడ్ రైతు మృతి ఘటనపై పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని.. బాధిత కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) లో ఫిర్యాదు చేశారు. దీంతోపాటు రాష్ట్వవ్యాప్తంగా భూపరిహారం కోసం రోజుల తరబడి ఎదురుచూస్తున్న మిగతా రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా పరిహారం త్వరితగతిన అందించాలని, ప్రభుత్వ కార్యాలయంలో బాధితులపై నిర్లక్ష్యం వ్యవహరించకుండా వారి వయసు రీత్యా వారికి తగిన గౌరవం ఇవ్వాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన జాతీయ మానవ హక్కుల కమిషన్ రైతు మృతి ఘటనపై తక్షణమే విచారణ చేపట్టిబాధ్యులపై తీసుకున్న చర్యలు, బాధిత కుటుంబానికి అందిన నష్టపరిహారం, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి నివేదికను నాలుగు వారాల్లోపు కమిషన్ కు సమర్పించాలని తెలంగాణ చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేసింది.

# బాల్క సుమన్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

## : మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

మంచిర్యాల : జిల్లాలోని క్యాతనపల్లిలో బాల్కసుమన్ పాటు బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌డిమాండ్ చేశారు.శనివారం బీఆర్ఎస్, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధు,చందర్, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేని శంకర్ మాట్లాడారు.క్యాతన్‌పల్లి మున్సిపాలిటీపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని అన్నారు.తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తున్నాడని ఆరోపించారు.క్యాతనపల్లి మున్సిపాలిటీలో 22 వార్డులలో బీఆర్ఎస్, సీపీఐ కూటమి 14 వార్డులు గెలుచుకోగా ప్రజాస్వామ్యబద్ధంగా జరుగవలసిని చైర్మన్ ఎన్నికను మంత్రి వివేక్, ఎంపీ వంశీ అడ్డుకుంటున్నారని విమర్శించారు.రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ డమ్మీ కమిషన్ మారిందని,బాల్క సుమన్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులపై మంత్రి వివేక్ ప్రోద్భలంతో పోలీసులు అక్రమ కేసులు నమోదు చేశారని ఆరోపించారు. క్యాతన పల్లి మున్సిపాలిటీ చేజిక్కించు కావాలన్న కుట్రలతో బీఆర్ఎస్, సీపీఐ కూటమి కౌన్సిలర్లను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.మంత్రి వివేక్ ఆదేశాలతో సింగరేణి అధికారులు క్యాతన పల్లి మున్సిపాలిటీ 11 వ వార్డు కౌన్సిలర్ భీమాగౌడ్ ఇంటిపై దాడి చేసి, కుటుంబసభ్యులపై దౌర్జన్యం చేశారని తెలిపారు. భీమాగౌడ్ తో కుటుంబానికి బీఆర్ఎస్ తరపున అండగా ఉంటామని వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మాట్లాడుతూ రాజ్యాంగం పట్టుకొని తిరుగుతున్న రాహుల్ గాంధీకి రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలన కనిపించడం లేదా అంటూ ప్రశ్నించారు.మంత్రి వివేక్ రేవంత్ తో తిరిగి దొంగలా మారిందని,సింగరేణి అధికారులు కాంగ్రెస్ కండువాలు కప్పుకొని కాంగ్రెస్ ఎమ్మెల్యే చెప్పినట్లు పనిచేస్తున్నారని విమర్శించారు. చెన్నూరు నియో జకవర్గంలో ఎమర్జెసి పాలన నడుస్తున్నదని ఆరోపించారు.టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు బీఆర్ఎస్ కౌన్సిలర్ భీమాగౌడ్ కుటుంబాన్ని నాయకులు పరామర్శించారు.



# మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నికలు జరిగేలా ఆదేశాలు ఇవ్వాలి



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి21:- తెలంగాణ రాష్ట్ర శనివారం ఎన్నికల కమిషనర్ ను కలిసి ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లిలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు జరిగేలా ఆదేశాలు ఇవ్వాలని ఎన్నికల కమిషనర్ ను బీఆర్ఎస్ నేతలు కోరారు. ఈ కార్యక్రమంలోబీఆర్ఎస్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీలు శంభిపూర్ రాజు, దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, పార్టీ నేతలు. తదితరులు ఉన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# ఏఐ పై మాజీ ఉప రాష్ట్రపతి సంచలన వ్యాఖ్యలు




**అమరావతి :** సాంకేతికతలో వడివడిగా దూసుకెళ్తున్న కృత్రిమ మేథస్సు పై భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ అంటే భయ మేస్తుందని, వింటేనే వణుకు పుడుతోందని ఆయన పేర్కొన్నారు.విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పూర్వ విధ్యార్థుల సంఘం స్వర్ణోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఐతో మానవ సంబంధాలు మంటగలసిపోతాయోమోనని భయమేస్తోందని, వావివరుసలు ఎక్కడ మరిచిపోతారెమోనన్న భయం నాలో ఉందని అన్నారు. దీనికి పరిష్కార మార్గాన్ని ఆయన సూచించారు.విధ్వేషాలు రెచ్చగొట్టకుండా ఏఐని కట్టడి చేయాలని, ఏఐపై ఉన్న భయాలు తొలగించి ఏఐని అదుపులోకి చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. నైతిక పద్దతుల్లో విలువలతో కూడిన సాంప్రదాయబద్దంగా ఏఐని ఎలా ఉపయోగించుకోవాలన్నది సవాలేనని అన్నారు. లేని పక్షంలో ఏఐ మహాభూతమై సమాజాన్ని సంక్షోభమార్గంలో తీసుకు వెళుతుందని వెల్లడించారు.ఏఐ వల్ల మానవాళికి నష్టం జరుగకుండా ప్రధాని మోదీ పలు సూచనలు చేశారని వివరించారు. సమాజం కూడా ఎప్పటికప్పుడూ స్పందించి పలు సూచనలు చేయాలని కోరారు. కేంద్రంలోని నరేంద్రమోదీ, ఏపీలో చంద్రబాబు నాయుడు ఏఐని టెక్నాలజీని ముందుకు తీసుకెళుతున్నారని ప్రశంసించారు. రాజకీయ నాయకులు బూతులు విపరీతంగా మాట్లాడుతున్నారని, గత ఎన్నికల్లో బూతులు మాట్లాడిన వాళ్లంతా ఓడిపోయారని అన్నారు.

# ఏపీలో కాంగ్రెస్ కార్యాలయాలపై కోడిగుడ్లు, రాళ్లతో దాడి




**అమరావతి :**ఏపీలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఇప్పటికే కూటమి వర్సస్ వైసీపీ మధ్య రాజకీయం పతాక స్థాయికి చేరింది. ఇదే సమయంలో ఢిల్లీలో చోటు చేసుకున్న పరిణామాలు ఏపీలోని పలు జిల్లాల్లో ప్రభావం చూపించాయి. ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమిట్ లో యూత్ కాంగ్రెస్ చేసిన నిరసన పైన బీజేపీ సహా పలు పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వైసీపీ, బీఆర్ఎస్ నేతలు సైతం ఈ తీరును తప్పు బట్టారు. కాగా.. తాజాగా ఏపీలోని కాంగ్రెస్ కార్యా లయాల పైన బీజేపీ మద్దతు దారులు దాడులు చేయటం సంచల నంగా మారింది .తాజాగా ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమిట్ లో యూత్ కాంగ్రెస్ శ్రేణులు చొక్కాలు లేకుండా సదస్సు జరుగుతున్న ప్రాం తంలో చేసిన నిరసన.. ఆ తరువాత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల వ్యవహారం కలకంగా మారింది. ఈ అంశం పైన బీజేపీ నేతలు సీరియస్ గా స్పందించారు. యూత్ కాంగ్రెస్ తీరును తప్పు బట్టారు. ఈ వ్యాఖ్యలు ఏపీలో ఉద్రిక్తతకు దారి తీసాయి. ఏపీలోని పలు జిల్లాల్లో బీజేపీ యువమోర్చా శ్రేణులు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలపై దాడులకు దిగాయి. కాగా . గుంటూరు జిల్లాలో కాంగ్రెస్ కార్యాలయంపై రాళ్లు, కోడి గుడ్లతో బీజేపీ కార్యకర్తలు దాడి చేశారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీవర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలీపై దాడి జరిగినట్లు ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ప్రతిగా బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెసు కార్యకర్తలు నినాదాలు చేశారు. పోలీసుల తీరుపై మస్తాన్ వలీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఆఫీస్‌లపై దాడులు చేస్తుంటే పోలీసులు చోద్యం చూస్తారా అంటూ మండి పడ్డారు.దాడుల పై షర్మిల సీరియస్అదే విధంగా కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీసు వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కోడిగుడ్లు, టమో టాలతో కాంగ్రెస్ పార్టీ ఆఫీసుపై రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి, అనుచరులు దాడి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆఫీసు గేటు ధ్వంసం చేసి ఫ్లెక్సీలను చింపేశారు. దాడుల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆఫీసు వద్ద భారీగా పోలీసులు మోహరించారు. విజయనగరం జిల్లా లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం చేసుకుంది.

# తిరుమల, తిరుపతి దేవస్థానానికి హైదరాబాద్ భక్తుడు భారీ విరాళం



**తిరుమల :** వడ్డీకాసులవాడు వేంకటేశ్వరస్వామికి హైదరాబాద్ కు చెందిన శివకోటి సిద్ధార్థ అనే భక్తుడు భారీ విరాళానాన్నిఅందజేశారు. శ్రీ వేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు రూ.50 లక్షలు విరాళంగా అందించి తన భక్తిని చాటుకున్నారు. ఈ మేరకు దాత తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం చెక్కును అందజేశారు.తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీకలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లు నిండిపోయాయి. శిలాతోరణం వరకు భక్తులు క్యూలైన్లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 20 గంటల్లో సర్వదర్శనం అవుతుందని
టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 68,156 మంది భక్తులు దర్శించుకోగా 28,295 మంది తలనీలాలు సమ ర్పించుకున్నారు. భక్తులు కానుకల వల్ల హుండీకి రూ. 3.46 కోట్లు ఆదాయం వచ్చిందని వివరించారు.

# ఏపీలో డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీల జారీలో కీలక మార్పు-త్వరలో జారీ..




**అమరావతి :**ఏపీలో వాహనదారులకు జారీ చేసే డ్రైవింగ్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ల సర్టిఫికెట్ విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకూ చిప్ ఆధారిత స్మార్ట్ కార్డుల్ని వాహనదారులకు జారీ చేస్తుండగా.. వాటి స్థానంలో తక్కువ ఖర్చుతో మరో మార్పు తీసుకొస్తున్నారు. ఇది వెంటనే అమల్లోకి రాబోతోంది. దీంతో గతంలో జారీ అయిన కార్డుల స్థానంలో వీటిని తీసుకునే అవకాశం కల్పించడంతో పాటు కొత్త కార్డుల్ని సైతం ఇదే విధానంలో జారీ చేయబోతున్నారు.కొత్త వాహనాలు కొనుగోలు చేసినప్పుడు జారీ చేసే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ)కార్డులతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ పాసయిన తర్వాత జారీ చేసే స్మార్ట్ కార్డుల్ని గతంలో చిప్ ఆధారిత వ్యవస్థలోకి మార్చారు. దీంతో ఈ స్మార్ట్ కార్డులపై చిప్ కనిపించేది. ఇందులోనే సదరు కార్డుకు సంబంధించిన డేటా అంటే స్టోర్ అయ్యేది. కానీ ఇప్పుడు చిప్ స్థానంలో క్యూఆర్ కోడ్ తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ప్రభుత్వానికి డబ్బులు ఆదా కాబోతున్నాయి.గతంలో తీసుకొచ్చిన చిప్ ఆధారిత విధానంలో ప్రతీ ఆర్సీ లేదా డీఎల్ స్మార్ట్ కార్డు కోసం రూ.200 ఫీజు, పోస్టల్ ఛార్జీలు రూ.35 కలిపి రూ.235 ముందుగానే వసూలు చేసేవారు. కానీ కార్డులు మాత్రం ఇళ్లకు వచ్చేవి కావు. ఆ తర్వాత 2023 నుంచి వాహనదారుల నుంచి ఈ ఛార్జీలు వసూలు చేయడం మానేసి, కార్డులు జారీ చేయడం కూడా మానేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాగానే 2024 అక్టోబర్ 1 నుంచి మళ్లీ ఈ ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

# వేసవిలో తిరుమలకు వెళ్లే భక్తులకు గుడ్ న్యూస్



**తిరుమల:**తిరుమలలో భక్తుల రద్దీ నెలకొంది. శనివారం నాడు 57,682 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వారిలో 27,020 మంది తలనీలాలు సమర్పించారు. తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆ ఒక్క రోజే హుండీ ద్వారా 3.65 కోట్ల రూపా యల ఆదాయం తిరుమల తిరుపతి దేవస్థానానికి అంది ంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో అన్ని కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. కృష్ణ తేజ గెస్ట్ హౌస్ వరకు క్యూ లైన్ ఏర్పడింది. టోకెన్ లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి 10 నుంచి 12 గంటల సమయం పట్టింది.వేసవి సెలవుల్లో తిరుమలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ చర్యలు చేపట్టింది. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కా ప్రణాళికలను రూపొందించుకుంటోంది. దీనిపై టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి సీహెచ్ వెంకయ్య చౌదరి సమీక్షా సమావేశం నిర్వహించారు. రెండు- మూడు సంవత్సరాల వేసవి డేటాను పరిగణనలోకి తీసుకుని భక్తుల సంఖ్య, వేచి ఉండే సమయం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అన్నప్రసాదం, మంచినీటి పంపిణీ, నడక దారి భక్తులకు మార్గమధ్యలో షెడ్ల ఏర్పాటు, మాడ వీధులు తదితర ప్రాంతాల్లో కూల్ పెయింటింగ్ వేయాలని నిర్ణయించారు. అలాగే మజ్జిగ పంపిణీ పాయింట్ల సంఖ్యను పెంచి వేసవిలో భక్తుల దాహార్తిని తీర్చేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటారు. వసతి సదుపాయాలు, అన్నప్రసాదం నిర్వహణను మరింత సమర్థంగా అమలు చేయనున్నారు. నడ కదారి భక్తులు, అధిక రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక మెడికల్ క్యాంప్స్ ఏర్పాటు చేస్తారు.వేసవిలో కంపార్ట్ మెంట్లు, క్యూలైన్లల్లో ఈవో తెలిపారు.

# సమాచార హక్కు దరఖాస్తుల్లో కీలక మార్పు-ఇకపై ఇలా-సర్కార్ జీవో..





**ఢిల్లీ:**సమాచార హక్కు చట్టం ప్రకారం విధిగా ఇవ్వాల్సిన సమాచారాన్ని అడ్డుకుంటున్న ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు తాజాగా కొన్ని మార్గదర్శకాలు ఇచ్చింది. వీటిని రాష్ట్రాలు తప్పకుండా అమలు చేయాలని సూచి ంచిం ది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం కూడా సమా చార హక్కు చట్టం ప్రకారం సమా చారం కోరుతూ వచ్చే దరఖాస్తులు, అప్పీళ్ల నిర్వహణ విషయంలో ఆర్టీఐ ఎంఐఎస్ పేరుతో కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది .ఫిబ్రవరి 18వ తేదీ నుంచి దీన్ని అమల్లోకి తెస్తున్నట్లు ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ కొత్త విధానం ప్రకారం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపు చేస్తే.. ఎస్మెమ్మెస్, ఈ-మెయిల్స్ ద్వారా అప్ డేట్స్, 30 రోజుల్లో ప్రాథమిక సమాచార అధికారి (పీఐవో) నుంచి సమాధానం వస్తాయి.దీనిపై అవసరమైతే ఫస్ట్ అప్పీలు, సెకండ్ అప్పీలు కూడా వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. అలాగే వీటికి టైమ్ లైన్స్ కూడా ఇచ్చారు. జిల్లా నోడల్ ఆఫీసర్ అయితే 5 రోజుల్లో దరఖాస్తు ఫార్వర్డ్ చేయాల్సి ఉంటుంది. పీఐవో అయితే 30 రోజుల్లో సమాచారం ఇవ్వాలి. ఎఫ్ఏఏ అయితే 30 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలి. సెకండ్ అప్పీల్ విషయంలో 90 రోజుల్లో దాఖలు చేసుకోవచ్చు. ఈ దరఖాస్తుల్ని ఇంటి దగ్గరి నుంచే ఆన్ లైన్ లో చేసుకోవడంతో పాటు ట్రాకింగ్, అప్పీల్ కూడా చేసుకునే అవకాశం ఉంటుంది.

# వేసవి సెలవుల్లో తిరుమలకు పెరగనున్న రద్దీ.. వేగంగా దర్శనాలు పూర్తయ్యేలా టీటీడీ ఏర్పాట్లు



**తిరుమల:** వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలకు భక్తుల రద్దీ భారీగా పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కా ప్రణాళికతో సమర్థవంతగా చేపడుతున్నట్లు టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలోని సుధర్మ సమావేశ మందిరంలో వేసవి ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత రెండు మూడు సంవత్సరాల వేసవి డేటాను విశ్లేషించి, దర్శనాల సంఖ్య, వేచి ఉండే సమయం, తర్వాత దర్శనాలకు క్యూలైన్లలో వేచి ఉండే భక్తుల సంఖ్య వంటి అంశాలపై విస్తృతంగా చర్చించినట్లుగా తెలిపారు.భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అన్నప్రసాదం, తాగునీటి పంపిణీ, నడక దారి భక్తులకు మార్గమధ్యలో షెడ్ల ఏర్పాటు, మాడ వీధులు తదితర ప్రాంతాల్లో కూల్ పెయింటింగ్, అవసరమైన చోట్ల షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు వెంకయ్య చౌదరి వెల్లడించారు. అలాగే మజ్జిగ పంపిణీ పాయింట్ల సంఖ్యను పెంచి వేసవిలో భక్తుల దాహార్తిని తీర్చేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు.వేసవి సెలవుల్లో కుటుంబాలతో కలిసి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో వసతి సదుపాయాలు, అన్నప్రసాదం నిర్వహణను మరింత సమర్థంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నడకదారి భక్తులు, అధిక రద్దీ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను బలోపేతం చేసి మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.సామాన్య భక్తులు దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించి వీలైనంత త్వరగా దర్శనం కలిగేలా చర్యలు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అదనపు ఈవో తెలిపారు. ఈసారి ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా టెక్నాలజీ వినియోగాన్ని మరింత పెంచి, గంటల వారీగా ఇన్--అవుట్ ఫ్లో, వేచి ఉండే సమయాన్ని ప్రతి నిమిషం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట తక్షణ నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. వివిధ కేటగిరీల దర్శనాలను డేటా ఆధారంగా హేతుబద్ధంగా కంపార్ట్మెంట్లు, క్యూ లైన్లలో భక్తులు వేగంగా దర్శనం పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.గత వేసవిలో జూన్ నెలలో సగటున రోజుకు 80 వేల నుంచి 82 వేల మందికి దర్శనం కల్పించామని, అలాగే 2026 జనవరిలో రోజుకు సగటున 74 వేల మందికి పైగా దర్శనం కల్పించినట్లు గుర్తు చేశారు. ఇది సమర్థవంతమైన టైమ్ మేనేజ్‌మెంట్, అన్ని విభాగాల సమన్వయంతో సాధ్యమైందని వివరించారు.
వేసవిలో భక్తులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా టీటీడీ అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తాయని అదనపు ఈవో
ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఇకపై..



**తిరుపతి:**తిరుపతికి వెళ్లే ప్రయాణికులకు రైల్వే అధికారులు శుభవార్త అందించారు. రైళ్ల రాకపోకలను మరింత మెరుగుపర్చే దిశగా కీలక నిర్ణయాన్ని తీసుకున్నారు. తిరుపతి- రామేశ్వరం మధ్య రాకపోకలు సాగించే ఎక్స్ ప్రెస్ ఫ్రీక్వెన్సీని పెంచారు. అత్యంత రద్దీ మార్గాల్లో ఒకటైన తిరుపతి రూట్ లో వేలాదిమంది భక్తులు, ఇతర ప్రయా ణికులకు రవాణా సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చే క్రమంలో ఈ తాజా చర్యలు తీసుకున్నారు.తిరుపతి- రామేశ్వరం మధ్య నడిచే మీనాక్షి ఎక్స్ ప్రెస్ ఇకపై వారంలో నాలుగు రోజుల పాటు అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం మూడు రోజుల పాటు మాత్రమే రాకపోకలు సాగిస్తూ వస్తోంది. చాలాకాలంగా ఉన్న డిమాండ్ ఇది. తమిళనాడు చిట్టచివరి ప్రాంతం నుంచీ ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుపతికి నేరుగా రైలు కనెక్టివిటీ కల్పించే ఎక్స్ ప్రెస్ ఇది. ప్రయాణికుల నుంచి అంచనాలకు మించిన ఆదరణ ఉండే రైలు ఇది.దీని ఫ్రీక్వెన్సీని పెంచాలని, వారంలో నాలుగు రోజుల పాటు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికుల నుండి పలు విజ్ఞప్తులు అందాయి. వీటిపై రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలపై తాజాగా రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. మార్చి 3వ తేదీ నుంచి ఈ ఎక్స్ ప్రెస్ వారంలో నాలుగు రోజుల పాటు అందుబాటులో ఉంటుంది.నంబర్ 16780 రామేశ్వరం - తిరుపతి ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం గురు, శుక్ర, ఆదివారాల్లో నడుస్తోంది. కొత్తగా మంగళవారం కూడా తోడైంది.

Printed, Published & Owned by BATTU LAXMI NARAYANA ; Printed at BATTU PRINTERS, PLOT NO 30 .ROAD NO 2. MADHRA NAGAR. MANSURABAD .LBNAGAR R R DIST., TELANGANA,
Published from BATTU.PUBLICATIONS, H.NO PLOT NO 30 .ROAD NO 2. MADHRA NAGAR. MANSURABAD .LBNAGAR, R R DIST. Editor: BATTU LAXMI NARAYANA, CELL:9951693876